దివ్యాంగులకు అందని ఆసరా

- ఎనిమిదేళ్లుగా పింఛన్ కోసం ఎదురు చూపులు
- స్లాట్ బుకింగ్‌లతో ఇబ్బందులు



మధియ సైట్-3

బోరబండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లుగా కొత్త పింఛన్ల కోసం దివ్యాంగుల ఎదురుచూస్తున్నారు. వైకల్యాన్ని గుర్తించడానికి పాటించాల్సిన పద్ధతిలో నిర్లక్ష్యం కారణంగా పింఛన్ కోసం నేటికీ ఎదురు చూపులు తప్పడంలేదు.

ఎనిమిది సంవత్సరాలు గడిచినా..

మీ సేవలో దరఖాస్తు పూర్తి చేసి స్లాట్ బుక్ చేయడం, డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించి నిర్ధారించిన తర్వాత సంబంధిత వైద్య అధికారి వైకల్యం ఉందని సదరం సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత పింఛన్ మంజూరు అవుతుంది.

ఈ క్రమపద్ధతి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎనిమిది సంవత్సరాలు గడిచినా పింఛన్ అందని అభాగ్యులున్నారు. పింఛన్ అందక, మందులు కొనలేక, పిల్లలు, పెద్దల సంరక్షణ భారంగా మారుతోందని కొంత మంది తల్లి దండ్రులు మనోవేదనతో కన్నీటి పర్యంతమై 'ఆంధ్రజ్యోతి'తో వారి కష్టాలను పంచుకున్నారు.

జాప్యంతో అందని ఆసరా

వారంతా పుట్టుకతో మతి స్థిమితం లేని వారు. పక్షవాతంతో ఎదో ఒక శరీర భాగం వైకల్యంతో బాధపడుతున్న వారే. వీరికి ఏళ్లు కావస్తున్నా ఆసరా పథకం అందడంలేదు. కారణం కొన్ని నిబంధనలు వారికి గుదిబండగా మారాయి. దీనికి తోడు మీ సేవ సిబ్బంది నిర్లక్ష్యం, చేస్తున్న తప్పిదాలకు వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మీ సేవలో ఒకసారి జరిగిన పొరపాటుకు నాలుగు నెలలు ఆగవాల్సి వస్తోంది.

పాపకి నెల మందులకు రూ. 3 వేలు



మా పాప మధియ ఏడు సంవత్సరాలుగా బుద్ధిమాంద్యంతో బాధపడుతోంది. పింఛన్ దరఖాస్తు ఎస్ఆర్ నగర్ మీ సేవలో చేస్తే వారు సదరం కోసం ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి రాశారు. అక్కడ 12 సంవత్సరాల లోపు పిల్లలకు చూస్తారంట. మరో ఆస్పత్రికి మార్చడానికి ఆరు నెలలు ఆగమన్నారు. నాకు ముగ్గురు ఆడ పిల్లలు. మధియ పెద్ద పాప నెలకి మూడు వేయిలు మందుల ఖర్చు అవుతోంది. పింఛన్ వస్తే కొంత భారం తగ్గుంది.

- మహ్మద్ యాసిన్, మధియ తండ్రి సైట్-3

స్లాట్ బుకింగ్ రద్దు చేయాలి



సదరం సర్టిఫికెట్ ఏ ఆస్పత్రి వారు ఎవరికి ఇస్తారనే అవగాహన మీ సేవ సిబ్బందికి లేదు. స్లాట్ బుక్ చేసిన అనంతరం ఆ ఆస్పత్రికి వెళ్తే మీకు ఇక్కడ కాదు.. వేరే ఆస్పత్రికి వెళ్లండంటున్నారు. అటు ఇటు తిరగడానికి బెడ్ పేషేంట్లకు ఇబ్బందిగా మారింది. దివ్యాంగులు, మతి స్థిమితం లేని వారి వేలు ముద్రలు బయో మెట్రిక్ పరికరం తీసుకోవడం లేదు. దీంతో సంవత్సరాలైనా అర్హులకు ఆసరా పింఛన్ అందడం లేదు. గతంలో వైద్య పరీక్షలు నిర్వహించిన ఆస్పత్రిలోనే వైద్యుడు వైకల్యాన్ని బట్టి సదరం సర్టిఫికెట్ ఇచ్చే వారు. ఇదే పద్ధతి కొనసాగించాలి.

- జాలా నరేందర్ యాదవ్, దివ్యాంగుల పోరాట నాయకులు



ఉమ్మడి రాష్ట్రం నుంచి రావడం లేదు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి పింఛన్ కోసం దరఖాస్తు చేస్తూనే ఉన్నాను. ఇంత వరకు ఏ అధికారి, ఏ నాయకుడు నా కష్టాన్ని చూచి కనికరించ లేదు. రెక్కాడితే కాని డొక్క నిండే పేద కుటుంబం మాది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పింఛన్ విడుదల చేస్తారని వేడుకుంటున్న

- మూలి జగన్‌నాయకులు, రాజ్‌నగర్

ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నా..

పింఛన్ కోసం ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నాను. మూడు సార్లు దరఖాస్తు చేసుకున్నాను. ఇంకా పరిశీలనలో ఉందంటున్నారు. నెలకు మందులు 1700 రూపాయాలు ఖర్చు అవుతుంది. కనీసం ఫిజియోథెరపి చేపిద్దామన్నా డబ్బులు లేవు. త్వరగా పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్న.

- ఎం.నరసింహ, ఎల్.ఎన్ నగర్



ఇంక్యుబేటర్ స్టార్ కార్యక్రమంలో చెక్కులు అందుకుంటున్న స్టార్టప్ సంస్థల ప్రతినిధులు

ఘనంగా ఎల్‌వీ ప్రసాద్ 2వ ఇంక్యుబేటర్ స్టార్ కార్యక్రమం

- సన్ బాట్స్ ఇన్నోవేషన్‌కు మొదటి బహుమతి

హైదరాబాద్ సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కంటి సంరక్షణ రంగంలో స్టార్టప్‌లను ఇండస్ట్రీకి అనుసంధానం చేసేందుకు ఇంక్యుబేటర్ స్టార్ అవార్డు పేరుతో అవకాశం కల్పిస్తున్నామని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ చైర్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ (ఎల్‌వీపీఈఐ), ఆల్ ఇండియా అప్తాల్మో లాజికల్ సొసైటీ (ఏఐఓఎస్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఇంక్యుబేటర్ స్టార్ ఆఫ్ ఛాలెంజ్ 2 ముగింపు వేడుకలు ఎల్‌వీపీఈఐ బంజారాహిల్స్‌లో శనివారం నిర్వహించారు. స్టేట్ ఇన్నోవేషన్ సెల్ తాత్కాలిక చీఫ్ ఇన్నోవేషన్ అధికారి, ఆర్ఐసీహెచ్ డైరెక్టర్ అజిత్ రంగ్నేకర్, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి, ఏఐఓఎస్ ప్రతినిధి డాక్టర్ హర్బంష్ లాల్‌లతో కలిసి విజేతలను ప్రకటించారు. విజేతగా నిలిచిన సన్‌బాట్స్ ఇన్నోవేషన్‌కు ఎల్‌వీపీఈఐ ద్వారా రూ. 5లక్షలు 12నెలలు ఉచిత ఇంక్యుబేషన్, మొదటి రన్నరప్ ఇన్నోవేస్ ఇండియా ప్రైవేట్‌కు రూ. 3లక్షలు, 6నెలల ఉచిత ఇంక్యుబేషన్, 2వ రన్నరప్ పాకెట్ ఫోల్డబుల్ ఫండాస్కోప్‌కు రూ. 2 లక్షలు, 6 నెలల ఉచిత ఇంక్యుబేషన్ అందుకున్నారు. అలాగే ఏఐఓఎస్ ఐఇన్వెంట్ హ్యాకథాన్ విజేతగా డాక్టర్ శివరాజ్ టాగోరే, 1వ రన్నరప్‌గా డాక్టర్ శివంగుప్తా, 2వ రన్నరప్‌గా డాక్టర్ సమత్ర కబ్రాలను ప్రకటించారు. ఈ విజేతలకు కోల్‌కతాలో జరిగే ఆలిండియా ఆప్తాల్మోలాజికల్ సొసైటీ సమావేశంలో తమ ఆవిష్కరణలు, ఆలోచనలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. ఆవిష్కరణ స్టార్టప్‌లను ఇచ్చి తదుపరి స్థాయికి చేర్చేందుకు మద్దతును ఇస్తారు.



ఎన్నికల్లో గెలుపొందిన యూనియన్ సభ్యులు

నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలిగా శాంతి

సనత్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలుగా శాంతకుమారి గెలుపొందారు. ఈ ఎన్నికలకు విశ్రాంత డిప్యూటీ లేబర్ కమిషనర్ నిర్మల్ కుమార్ ప్రసాద్, ఎలక్షన్ ఆఫీసర్లుగా పూర్వ ప్రధాన కార్యదర్శి శిరందాస్ శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ కె.మహేష్ బాబు, టెక్నికల్ ఆఫీసర్ డి. గోవింద్ వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులకు 533 ఓట్లు ఉండగా, 471 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యక్షులుగా రమణమ్మ కె.సుభద్ర, కాంట్రాక్టు సిబ్బంది తరఫున అరుణ ప్రధాన కార్యదర్శిగా డీఎస్.భరత్ భూషణ్, సహాయ కార్యదర్శులుగా నిర్మలాజ్యోతి, బిడుగు శేఖర్, కార్యనిర్వహన కార్యదర్శులుగా ఎండీ అబ్దుల్ వారిస్, పి.కరుణ సాంస్కృతిక కార్యదర్శులుగా టి.రమా దుర్గాంబ, కోశాధికారిగా డా. సుధారాణి విజయం సాధించారు. కాంట్రాక్ట్ టెక్నీషియన్ల తరఫున జాయింట్ సెక్రెటరీగా బి.లక్ష్మీనారాణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవి కళాధర్.. ఏక గ్రీవంగా గెలుపొందారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులను ఉద్యోగులు అభినందించారు.



అభివాదం చేస్తున్న అజీజ్ పాషా, రాపోలు ఆనంద్ భాస్కర్, దాసు సురేష్, శ్రీనివాస్, తదితరులు

బీసీ ఎమ్మెల్యే లెజిస్లేచర్ కమిటీని ఏర్పాటు చేయాలి

పంజాగుట్ట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ఓబీసీ స్టాండింగ్ కమిటీ మాదిరిగా తెలంగాణ అసెంబ్లీలో బీసీ లెజిస్లేచర్ కమిటీని ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేశ్ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సబ్బండవర్గాల ఆత్మగౌరవ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మాజీ ఎంపీలు రాపోలు ఆనంద భాస్కర్, అజీజ్ పాషా, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు విశారదన్ మహారాజ్, తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో దశాబ్దాలుగా వివక్షకు, నిరాదరణకు లోనవుతున్న బీసీ, అణగారిన వర్గాలు తమ అవకాశాలకోసం నేటికీ పోరాడాల్సిన పరిస్థితులే నెలకొన్నాయని వారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బీసీ, దళిత, గిరిజన మైనార్టీలకు సముచిత ప్రాతినిధ్యం లేదన్నారు. బీసీలకు ప్రత్యేకమైన పారిశ్రామిక పాలసీని, ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. బీసీ, ఎస్టీ వర్గాలకు డిప్యూటీ సీఎంగా అవకాశాలను కల్పించాలని కోరారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో 10 స్థానాలను బీసీలకు కేటాయించాని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, గుజ్జ కృష్ణ, దొంత ఆనందం, ఆళ్ల రామకృష్ణ, యుగేందర్ యాదవ్, శివ, కిశోర్, దానకర్ణ చారి, ఊర్మిళ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సింథటిక్ వేలిముద్రల ఎఫెక్ట్

- 14 మంది బోగస్ కార్మికుల తొలగింపు
- ఇద్దరు ఎస్ఎఫ్ఏలపైనా వేటు
- కమిషనర్ అత్యవసర సమీక్ష

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల బోగస్ హాజరుపై కమిషనర్ సీరియస్ అయ్యారు. పోలీసులకు పట్టుబడిన ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎస్ఎఫ్ఏ), 14 మంది బోగస్ పారిశుధ్య కార్మికులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సింథటిక్ వేలిముద్రలు వినియోగిస్తూ అంబర్‌పేట సర్కిల్‌కు చెందిన ఎస్ఎఫ్ఏలు పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో శనివారం సహాయ వైద్యాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. అంబర్‌పేట సర్కిల్‌లో గుర్తించిన 11 మంది, శేరిలింగంపల్లిలో ముగ్గురు బోగస్ కార్మికులకు సింథటిక్ వేలిముద్రలతో హాజరు వేస్తున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారిని తొలగించారు. త్వరలో మరికొందరు ఎస్ఎఫ్ఏలు, శానిటరీ సూపర్వైజర్‌లపై వేటు పడే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. అంబర్‌పేటలో ఎస్ఎఫ్ఏలు పట్టుబడడంతో అక్కడి అధికారులను మందలించారని సమాచారం. ఏఎంఓహెచ్‌లు కొందరికి త్వరలో మెమోలూ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. సింథటిక్ వేలిముద్రలు పని చేయకుండా కొత్త యంత్రాలు అందుబాటులోకి తీసుకువచ్చి నా.. పాతమిషన్లు ఎలా వినియోగిస్తున్నారు? వారికి సహకరిస్తున్నదెవరు..? కేంద్ర కార్యాలయంలోని ఐటీ ఉద్యోగుల పాత్రపైనా కమిషనర్ ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

మల్లారెడ్డి గార్డెన్స్‌కు కూల్చివేత నోటీసు

- జారీ చేసిన కంటోన్మెంట్ బోర్డు

సికింద్రాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కుటుంబీకుల ఆధీనంలో ఉన్న మల్లారెడ్డి గార్డెన్స్ ఆవరణలోని కట్టడాల కూల్చివేతకు సంబంధించి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. బోయినపల్లిలోని 7.80 ఎకరాల ఓల్డ్ గ్రాంట్ బంగ్లా చాలా కాలం క్రితం నుంచి మల్లారెడ్డి కుటుంబీకుల ఆధీనంలో ఉంది. మల్లారెడ్డి గార్డెన్స్ పేరిట ఫంక్షన్ హాలు, చందన గార్డెన్స్ పేరిట ఫంక్షన్ హాల్, సీఎంఆర్ హైస్కూల్, సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరిట విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మించారని, వీటిని కూల్చివేస్తామంటూ అప్పట్లో కంటోన్మెంట్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపై మల్లారెడ్డి కుటుంబీకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకున్నారు. ఇటీవల న్యాయస్థానం స్టేను డిస్మిస్ చేసింది. దాంతో నాలుగు రోజుల క్రితం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు మల్లారెడ్డి కుటుంబీకులకు కంటోన్మెంట్ చట్టం 320 సెక్షన్ కింద నోటీసు జారీ చేశారు. దీని ప్రకారం నోటీసు జారీ చేసిన 8 రోజుల అనంతరం నిర్మాణాలను కంటోన్మెంట్ బోర్డు నేల మట్టం చేయవచ్చు. ఇదిలా ఉండగా మల్లారెడ్డి కుటుంబీకులకు నోటీసు జారీ చేసిన విషయం వాస్తవమేనని, ఈపాటికే నాలుగు రోజులు గడిచినందున బుధవారం అనంతరం తగిన చర్యలు ఉంటాయని కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ లక్ష్మణ్

బంజారాహిల్స్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం లా కాలేజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లాటెక్-2024 ఇంటర్నేషనల్ సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంచుకున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇంప్లికేషన్స్ ఆఫ్ డాటా ప్రైవసీ అండ్ సైబర్ సెక్యూరిటీ అంశంపై ఆయన లా విద్యార్థుల ను, అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు. 25ఏళ్లలో టెక్నాలజీ పరంగా దేశం మంచి పురోగతి సాధించిందన్నారు. టెక్నాలజీవల్ల చాలా వరకు మంచే జరుగుతున్నా... దాని మాటున చెడు కూడా జరుగుతున్నదని తెలిపారు. ప్రపంచం మొత్తం డిజిటల్ వైపు పరుగులు తీస్తున్నదని ఇంటర్‌నెట్ అనేది ఇప్పుడు ప్రతి గ్రామంలో ఓ నిత్యావసర వస్తువుగా మారిందని అన్నారు. లక్షలాదిగా డిజిటల్ అకౌంట్లు ఓపెన్ అవుతున్నాయని, అదే సమయంలో సైబర్‌నేరగాళ్ళు సైతం మోసాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి సెమినార్ల వల్ల ఎంతో నాలెడ్జ్‌ని షేర్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. దేశంలో ఎదుర్కొంటున్న సమస్యల్లో సైబర్ నేరాలు కూడా ఒక సమస్యగా ఉంటుందని ఇక్కడ ఒక క్రైం జరిగితే స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నామని, కానీ నేరం చేసిన వారు వివిధ దేశాల్లో ఉంటున్నారని, ఇలాంటి వాటిని ట్రేస్ చేయడం సవాల్‌తో కూడుకున్నదని, అందువల్ల నేరం జరగక ముందే ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. త్వరలోనే కోర్టులు పేపర్‌లెస్ కాబోతున్నాయని, అన్ని డిజిటల్‌లో మార్చబోతున్నాయని, ఇప్పటికే కొన్ని సంస్థలతో కలిసి ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో ఓయూ ప్రొఫెసర్ జీబీ. రెడ్డి, ప్రొఫెసర్ కె.జయశంకర్, సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, కార్యదర్శి జాఫర్ జావెద్, మీర్ అక్బర్ అలీఖాన్, లా కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్. వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను ముదిరాజ్

పంజాగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రస్తుత శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్టును రద్దు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభలు డిమాండ్ చేశాయి. ట్రస్ట్ పేరుతో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. శ్రీను ముదిరాజ్, కోశాధికారి నరేష్, సంయుక్త కార్యదర్శి అల్లుడు జగన్ ముదిరాజ్, మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, తదితరులు మాట్లాడారు. ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం కోకాపేటలో 5 ఎకరాల భూమి, రూ. 5 కోట్లు కేటాయించిందన్నారు. అన్ని ముదిరాజ్ సంఘాలతో చర్చించి ట్రస్టును ఏర్పాటు చేయాల్సి ఉండగా మహాసభ అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఎవరిని సంప్రదించకుండా ముగ్గురితో కలిసి ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఆర్టీఐ ద్వారా అడిగితే తమకు ఈ విషయం తెలిసిందన్నారు. వెంటనే ట్రస్టును రద్దు చేయాలని, ట్రస్ట్ పేరు మీద జరిగిన అవకతలపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూమి స్వాధీనం చేసుకొని, భవనాన్ని నిర్మించి ఇవ్వాలని వారు సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై త్వరలోనే సీఎంను, మంత్రులను కలుస్తామన్నారు. ఈనెల 3వ వారంలో అన్ని ముదిరాజ్ సంఘాలతో కలిసి నగరంలో భారీ సదస్సు నిర్వహిస్తామన్నారు. బండ ప్రకాష్ ముదిరాజ్‌ను నమ్మితే తమను మోసం చేశాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు గొడుగు శ్రీనివాస్, శివయ్య, సంతోష్, కోట్ల శ్రీనివాస్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



పీవీ నరసింహారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని, ఎమ్మెల్సీ వాణిదేవి తదితరులు

గొప్ప నాయకుడు పీవీ నరసింహారావు

బేగంపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన సందర్భంగా శనివారం బేగంపేటలోని పీవీ నరసింహారావు భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా పీవీ నరసింహారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ ఫొటో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పీవీ నరసింహరావుకు భారత రత్న ప్రకటించడం దేశానికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వాణిదేవి మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవ చేసిన తన తండ్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పీవీ ప్రభాకర్‌రావు, మాజీ ఎంపీ వేణుగోపాలచారి, కార్పొరేటర్ టి.మహేశ్వరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, శేఖర్ మారంరాజు, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, ఆరీఫ్ పాల్గొన్నారు.



సిటీ పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీ సభ్యులు

సిటీ పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ కమిటీ ఎన్నిక

హైదరాబాద్ సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ ఆసిఫ్‌ఖాన్, సెక్రటరీగా నల్లా శంకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సి.నవీన్‌కుమార్, ట్రెజరర్‌గా జీఎస్ఎం విక్టర్‌ను ఎన్నుకున్నారు. సొసైటీ డైరెక్టర్‌లుగా కొనిదెల రత్నకుమారి, యాంతని సుసాయి దయామని శాంతి, కేశవ్ మామిడి, దండు లక్ష్మణ్‌కుమార్, పి.వినీత్, బి.అప్పలసూరి ఎన్నుకోబడ్డారు. కొత్తగా ఎన్నికైన కమిటీ 2029 ఫిబ్రవరి 28 వరకు అధికారంలో ఉంటుందని సెక్రటరీ శంకర్ రెడ్డి తెలిపారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చేందుకు ప్రణాళిక

హైదరాబాద్ సిటీ: డ్రగ్స్ ఫ్రీ సిటీలో భాగంగా డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు విద్యాశాఖతో కలిసి పోలీసు అధికారులు కార్యాచరణ రూపొందించా రు. వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించనున్నారు. ఆదివారం కమాండ్ కంట్రోల్ రూములో విద్యాశాఖ సెక్రటరీ బి.వెంకటేశం, కమిషనర్లు కొత్తకోట శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి, టీఎస్‌న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, యాంటి నార్కొటిక్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ కేజీఎస్ఎస్ శ్రీకాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించనున్నారు.

యజమానికి తెలియకుండా స్థలం రిజిస్ట్రేషన్

యూసఫ్‌గూడ: స్థలాన్ని సంరక్షించమని చెప్పి విదేశాలకు వెళ్లిన మహిళ స్థలాన్ని అక్రమంగా విక్రయించారు. బోరబండకు చెందిన సందాని బేగం(73)కు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లో సుమారు 350 గజాల స్థలం ఉంది. ఆమె కుమారులు దుబాయ్‌లో ఉండటంతో వారి వద్దకు వెళ్లింది. వెళ్తున్న సమయంలో స్థలానికి తమ బంధువలును కేర్ టేకర్లుగా నియమించింది. స్థలం విక్రయించినట్లు వీడియోలు రావడంతో ఆమె హైదరాబాద్‌కు వచ్చింది. ఎర్రగడ్డలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సంప్రదించగా ఆమె స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తికి జీపీఏ చేసినట్లు గుర్తించింది. వెంటనే బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బకాయిలు చెల్లిస్తేనే ఔషధాలు సప్లై చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్


పంజాగుట్ట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఈఎస్ఐసీలకు సైతం అత్యవసర ఔషధాలు, చికిత్సలకు వినియోగించే వైద్యపరికరాలను సరఫరా చేయలేమని ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా టెండర్లు పొంది గాంధీ, ఉస్మానియా, నిమ్స్, నిలోఫర్‌లతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, ఈఎస్ఐసీలకు ఔషధాలు, రోగులకు అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేస్తున్నామని, గతేడాది ఆగస్టు నుంచి తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వక్తలు తెలిపారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనంలేదని వాపోయారు. రోగులకు ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని, ఆర్థిక వనరుల లేమితో సరఫరా చేయలేని దుస్థితి నెలకొందన్నారు. సమస్య జటిలం కాక ముందే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. టీఎస్ఎంఐడీసీ నుంచి రూ.300 కోట్లు, ఈఎస్ఐసీ నుంచి రూ.100 కోట్లు, నిమ్స్ నుంచి సుమారు రూ.50 కోట్లు, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల జనరల్ బడ్జెట్ నుంచి బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈనెల 31వ తేదీ లోపు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సామాన్య ప్రజల ఉన్నతికి శ్రీపాదరావు కృషి



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

హైదరాబాద్ సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గంలో సామాన్య ప్రజల ఉన్నతికి కృషిచేసిన దుద్దిల్ల శ్రీపాదరావు ఆదర్శంగా నిలిచారని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ అన్నారు. శ్రీపాదరావు జయంతి సందర్భంగా శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఖైరతాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి సీఎండీ ముషారఫ్ ఫరూకీ పూలమాల వేసి నివాళులర్పించారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా డీజీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన డీజీపీ రవిగుప్తా, అదనపు డీజీపీ మహేష్ భగవత్, ఐజీ రమేష్ ఇతర అధికారులు, సిబ్బంది. -హైదరాబాద్ సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి)



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్‌ను సత్కరిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

సకాలంలో స్పందించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం

రాంగోపాల్‌పేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సకాలంలో స్పందించి విద్యార్థిని పరీక్షకు హాజరయ్యేలా చూసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్‌ను, కానిస్టేబుల్ ఎస్.శివకుమార్, హోమ్‌గార్డ్ ఎస్.రమేష్‌లను ట్రాఫిక్ ఏసీపీ అభినందించి, శాలువాతో సత్కరించారు. శుక్రవారం ఎంజీ రోడ్డులోని తపస్యా కళాశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్ష రాయడానికి వస్తున్న అన్నానగర్‌కు చెందిన భవాని మార్గం మధ్యలో ప్రమాదానికి గురయ్యి తలకు గాయం అయ్యింది. అయినప్పటికీ పరీక్ష సమయం మించిపోతుందని అలాగే పరీక్ష కేంద్రానికి వచ్చింది. కానీ కనీసం కూర్చునే పరిస్థితిలో లేకపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ తన వాహనంలో పంపి ఆ విద్యార్థిని ప్రథమ చికిత్స చేయించి సమయానికి తిరిగి పరీక్ష కేంద్రానికి చేరుకునేలా సమయస్ఫూర్తిని ఉపయోగించిన నేపథ్యంలో శనివారం మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నార్త్ ఏసీపీ పి.శంకర్ రాజు అభినందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీసులు చేసే ఏమంచి పనినైనా ఎల్లప్పుడూ ప్రశంసించడం జరుగుతుందని, తగిన రివార్డులకు నామినేట్ చేసి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.



బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

తిరుమలగిరి మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : తిరుమలగిరి దొడ్డి అల్వాల్‌లో ఉన్న జిల్లాపరిషత్ హై స్కూల్‌లో మంచి మార్కులతో చదువుతున్న తొమ్మిదో తరగతి బాలికలకు రూ.25000ల విలువైన సైకిళ్లను రోటరీ క్లబ్ సికింద్రాబాద్ వారు శనివారం ఉదయం అందజేశారు. అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ బి.మల్లికార్జున దీక్షిత్, ప్రెసిడెంట్ కళ్యాణి, సెక్రటరీ భరత్‌రెడ్డి, అమర్‌నాద్, స్కూల్ హెడ్ మిస్ట్రెస్ జి.రమ, టీచర్స్ హేమలత, భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు. సైకాలజిస్ట్ మరియు అసిస్టెంట్ గవర్నర్ బి.మల్లికార్జున దీక్షిత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని మొబైల్ వాడకం తగ్గించి పుస్తకాలు దినపత్రికలు చదువుకోవాలని, మంచి ఆహారం తీసుకుంటూ రోజు వ్యాయామం చేయాలని ఉద్బోధించారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ నార్త్ వారు సహకరించారు.

మహిళకు కార్పొరేటర్ సాయం

అడ్డగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట ఎ సెక్షన్ ప్రాంతానికి చెందిన పద్మావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి స్పందించి వెంటనే సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేయించారు. బాధితురాలికి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1.50లక్షలు మంజూరు కావడంతో కార్పొరేటర్ ఆమెకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు.

ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజున మహంకాళి దేవాలయంలో అన్నదానం

తిరుమలగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజున అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తుల సహకారంతో అన్నదానం జరుగుతుందని దేవాలయం ఈఓ మహేందర్ రెడ్డి శనివారం తెలిపారు.



ఈఓ మహేందర్ రెడ్డి

ప్రతిరోజు అమ్మవారికి అర్చనలు జరుగుతాయని, ప్రతి శుక్రవారం భక్తుల సహకారంతో అభిషేకం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ఎలాంటి నూతన కమిటీ ఏర్పాటు కాలేదన్నారు. తమకు దాని గురించి తెలియదని అన్నారు.

మల్లారెడ్డి గార్డెన్స్‌కు కూల్చివేత నోటీసు

● జారీ చేసిన కంటోన్మెంట్ బోర్డు

సికింద్రాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కుటుంబీకుల ఆధీనంలో ఉన్న మల్లారెడ్డి గార్డెన్స్ ఆవరణలోని కట్టడాల కూల్చివేతకు సంబంధించి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. బోయిన్‌పల్లిలోని 7.80 ఎకరాల ఓల్డ్ గ్రాంట్ బంగ్లా చాలా కాలం క్రితం నుంచి మల్లారెడ్డి కుటుంబీకుల ఆధీనంలో ఉంది. మల్లారెడ్డి గార్డెన్స్ పేరిట ఫంక్షన్ హాలు, చందన గార్డెన్స్ పేరిట ఫంక్షన్ హాల్, సీఎంఆర్ హైస్కూల్, సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరిట విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మించారని, వీటిని కూల్చివేస్తామంటూ అప్పట్లో కంటోన్మెంట్ బోర్డు అధికారులు నోటీసులు జారీచేశారు. దీనిపై మల్లారెడ్డి కుటుంబీకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకున్నారు. ఇటీవల న్యాయస్థానం స్టేను డిస్మిస్ చేసింది. దాంతో నాలుగు రోజుల క్రితం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు మల్లారెడ్డి కుటుంబీకులకు కంటోన్మెంట్ చట్టం 320 సెక్షన్ కింద నోటీసు జారీచేశారు. దీని ప్రకారం నోటీసు జారీ చేసిన 8 రోజుల అనంతరం నిర్మాణాలను కంటోన్మెంట్ బోర్డు నేలమట్టం చేయవచ్చు. ఇదిలా ఉండగా మల్లారెడ్డి కుటుంబీకులకు నోటీసు జారీ చేసిన విషయం వాస్తవమేనని, ఈపాటికే నాలుగు రోజులు గడిచినందున బుధవారం అనంతరం తగిన చర్యలు ఉంటాయని కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

కంటోన్మెంట్‌కు రూ.48.53 కోట్లు

● టీపీటీ బకాయిలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కంటోన్మెంట్ బోర్డుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా నిలిచారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న టీపీటీ చార్జీల బకాయిల్లో రూ.48 కోట్ల 53 లక్షలను విడుదల చేశారు. గతంలోనూ మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడిగా బొల్లారంలోని కంటోన్మెంట్ ఆస్పత్రి ఆధునికీకరణకు రూ.కోటికి పైగా నిధులు కేటాయించి అందరి ప్రశంసలు పొందారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వెన్నెల, అమరేందర్‌రెడ్డి

సికింద్రాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జరిగే భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల తాలూకు ఆదాయంలో బోర్డుకు రావాల్సిన వాటా మొత్తం 2014కు ముందు వరకు నేరుగా జమయ్యేది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్(టీపీటీ) మొత్తం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమవుతూ వచ్చింది. ఇక్కడి నుంచి కంటోన్మెంట్ వాటా బోర్డుకు వచ్చేది. చాలా వరకు బకాయిలు పేరుకుపోయేవి. బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులు మొర పెట్టినప్పుడల్లా రూ.10కోట్లు, రూ.20 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల అయ్యేవి. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి బకాయిలు రావడం లేదంటూ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ తర్వాత కొంత మొత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి.

మరో రూ.75 కోట్ల వరకు టీపీటీ బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

సీఎంను కలిసిన వెన్నెల, అమరేందర్‌రెడ్డి

కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెన్నెల, పార్టీ సీనియర్ నాయకుడు మర్రి అమరేందర్‌రెడ్డిలు తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. టీపీటీ బకాయిలను విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మిగతా రూ.25 కోట్ల బకాయిలు కూడా త్వరలోనే విడుదలవుతాయని వారు పేర్కొన్నారు. కంటోన్మెంట్‌లో ఉచిత మంచినీటి పథకం అమలు సందర్భంగా 15 కోట్ల ట్యాక్స్ చెల్లించాలని మెట్రోవాటర్ బోర్డు షరతు విధించిందని, ఈ మొత్తాన్ని మాఫీ చేయాలని తాము చేసిన విన్నపానికి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. గతంలో బోర్డు చెల్లించాల్సిన నీటి చార్జీల బకాయిలపై వడ్డీని కూడా మాఫీ చేయాలని తాము కోరగా, సీఎం ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారని వారు చెప్పారు. కంటోన్మెంట్ అభివృద్ధి పట్ల తాను చిత్తశుద్ధితో ఉన్నానని రేవంత్‌రెడ్డి తమకు స్పష్టం చేసినట్టు వారు వెల్లడించారు. అలాగే, టీపీటీ బకాయిలు విడుదల చేసినందుకు రేవంత్‌రెడ్డికి బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

పరివార్ జాతీయ తల్లిదండ్రుల అవగాహన

బోయిన్‌పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మేధో వైకల్యం, బహుళ వైకల్యాలు ఉన్న పిల్లల తల్లిదండ్రుల వారసత్వ ప్రణాళిక, పీడబ్ల్యూడీఎస్ ప్యానెల్ చర్చల కోసం వివిధ పథకాలు వాటి



వివిధ పథకాలు వాటి ప్రయోజనాలకు సంబంధించి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రయోజనాలపైన అవగాహన సమావేశం శనివారం ప్రారంభమైంది. ఈ సమావేశం సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో గల మనోవికాస్ నగర్‌లోని ఎన్ఐఎంహెచ్ (ఎన్ఐఈపీఐడీ) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెక్చువల్ డిజెబిలిటీస్ సంస్థలో రెండురోజుల పాటు జరగనుంది. పరివార్ సంస్థ నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ పేరెంట్స్ (ఎన్‌సీపీఓ) సహకారంతో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సమావేశాలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మేధో వైకల్యం బహుళ వైకల్యాలు ఉన్న పిల్లల తల్లితండ్రుల పరివార్ సంస్థ ప్రతినిధులు సుమారు 300 మంది హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి (డీఈపీడబ్ల్యూడీ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిజబిలిటీస్ జాతీయ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ ఆన్‌లైన్ ద్వారా ముఖ్యఅతిథిగా పాల్గొనగా... పరివార్ అధ్యక్షుడు పంకజ్, నేషనల్ ట్రస్ట్ మాజీ చైర్‌పర్సన్ పూనంనటరాజన్, ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ మేజర్ బి.వి.రామ్‌కుమార్‌లు అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశం ఆదివారం సాయంత్రం ముగుస్తుందని, సమావేశానికి వచ్చిన వివిధ సంఘాల సభ్యులకు తల్లితండ్రులకు, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ మేజర్ బి.వి. రామ్‌కుమార్ వెల్లడించారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను విజయవంతం చేయాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో మార్చి 4, 5 తేదీల్లో ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న ప్రారంభోత్సవాలను విజయవంతం చేయా లని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఖైరతాబాద్, సనత్‌నగర్, గోషామహల్, ముషీరాబాద్, కార్వాన్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో రూ.55.10 కోట్లతో చేపట్టిన బీసీ వెల్ఫేర్, ఎడ్యుకేషన్, వైద్య, ఎస్సీ వెల్ఫేర్, స్త్రీ శిశు సంక్షేమ, మైనార్టీ సంక్షేమ శాఖల పనులను మంత్రి ప్రారంభిస్తారన్నారు. సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ రోహిణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న, ఎస్సీ వెల్ఫేర్ డీడీ యాదయ్య, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ షఫీమియా, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో శ్రీపాదరావు జయంతి..

కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.కదివరన్, సోషల్ వెల్ఫేర్ డీడీ యాదయ్య, ఏఓ సదానందం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్ గుడిసెవాసులకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

● ప్రభుత్వం కేటాయించిన ఇళ్లను అమ్ముకుంటున్నారని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం

అడ్డగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి రెవెన్యూ పరిధిలోని రైల్ నిలయం అంబేడ్కర్‌నగర్ బస్తీలో ప్రభుత్వం కేటాయించిన ఇళ్లను భూకబ్జాదారులు బినామీ పేర్లతో విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ రౌతు రాజయ్య, బందెల నర్సింహ శనివారం మారేడుపల్లి డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారేడుపల్లి డివిజన్, మారేడుపల్లి రెవెన్యూ పరిధిలోని రైల్ నిలయం అంబేడ్కర్‌నగర్ బస్తీలో 1996లో గృహ నిర్మాణ పథకాన్ని ప్రారంభించిందని, ఈ నిర్మాణ పనులు 2000వ సంవత్సరం వరకు కొనసాగాయన్నారు. కొన్ని అవాంతరాలు ఏర్పడడంతో అసంపూర్తి నిర్మాణాలు ఆగిపోయాయి.

రైల్ నిలయం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వం కేటాయించిన ఇళ్లను చాటుమాటుగా విక్రయాలు జరుపుతున్నారు. బినామీ పేర్లతో బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారంటూ డిప్యూటీ తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ లకు చెందిన ఇళ్లను కబ్జాదారులు బెదిరించి ఇళ్లను రాయించుకుని అధిక ధరలకు బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారని, కొన్నేళ్ల నుంచి ఉంటున్న వారికి ఇళ్లు లేక అవస్థలు పడుతుంటే స్థానిక నాయకులు కొందరు బినామీ పేర్లతో బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారన్నారు. ఈ బస్తీలో లేఔట్ ప్రకారం ఈ స్థలంలో ఉన్న నిరుపేదల కుటుంబాలు గుడిసెలు వేసుకుని ఉంటున్నారని, వీటి స్థానంలో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

వెంటనే రైల్ నిలయంలో అంబేడ్కర్‌నగర్ బస్తీలో కబ్జాదారులపై విచారణ చేపట్టి చట్టపరంగా శిక్షించాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కోరారు. రెండు రోజుల్లో ప్రజా భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఇక్కడ సమస్యపై వివరిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా సరే అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలని వినతిపత్రంలో ప్రభుత్వాన్ని కోరారు.

తుర్కయంజాల్ వైస్ చైర్‌పర్సన్‌కు తప్పిన అవిశ్వాస గండం..?

హయత్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు శనివారం తొర్రూర్‌లోని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటి వద్ద సమావేశమయ్యారు. ఈనెల 5న మున్సిపాలిటీ కార్యాలయంలో జరగనున్న అవిశ్వాస తీర్మాన సమావేశానికి గైర్హాజరు అవుతామని కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్‌లు స్పష్టం చేశారు. దీంతో వైస్ చైర్‌పర్సన్ హరిత అవిశ్వాస గండం నుంచి గట్టెకినట్లేనని భావిస్తున్నారు. గత నెలలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 18 మంది కౌన్సిలర్‌లు వైస్ చైర్‌పర్సన్ హరితపై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కలెక్టర్ మార్చి 5న బలపరీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

అవిశ్వాసానికి హాజరుకాం: కాంగ్రెస్ కౌన్సిలర్లు



తొర్రూర్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాసం వద్ద సమావేశమైన కాంగ్రెస్ కౌన్సిలర్లు

వైస్ చైర్ పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి తాము హాజరుకామని కాంగ్రెస్ కార్పొరేటర్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే తామంత ఒక్క తాటిపై ఉన్నామని తెలిపారు. శనివారం తొర్రూర్‌లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి అవిశ్వాసం ఎదుర్కొంటున్న వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్‌తో పాటు కౌన్సిలర్‌లు సునీల్, కవిత, బాల్‌రాజ్, ధన్‌రాజ్, కౌశిక ఐలయ్యతోపాటు పలువురు కౌన్సిలర్‌ల భర్తలు, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.



విద్యార్థులచే పోలియో చుక్కల అవగాహన ర్యాలీ

పోలియో చుక్కలు వేయించే బాధ్యత తల్లిదండ్రులదే

● డాక్టర్ సాయిశంకర్

అడ్డగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదని అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయిశంకర్ సూచించారు. అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఆస్పత్రి సీనియర్ నర్సులు, ఆశా వర్కర్లతో అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం నుంచి తుకారాంగేట్ అడ్డగుట్ట ఈస్ట్ మారేడుపల్లి ప్రధాన కూడళ్ల నుంచి తిరిగి బ్యానర్ పట్టుకుని అవగాహన కల్పిస్తు ఆస్పత్రికి చేరుకున్నారు. పోలియో చుక్కలపై ప్రజల్లో అవగాహన రావడం కోసమే ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నర్సు విద్యాప్రీతి, నవనీతలతో పాటు ఆశా వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి : కంటోన్మెంట్ నాలుగు, ఐదు వార్డుల పరిధిలోని 14 సెంటర్‌లతో పాటు జూబ్లీ బస్ స్టేషన్‌లో రెండు సెంటర్‌లు, పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ వద్ద ఒక సెంటర్, ఉదయం 6 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పికెట్ యూపీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విశాల్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం అందుబాటులో లేనివారి కోసం సోమ, మంగళవారం రోజుల్లో ఇంటింటికీ తిరిగి తమ సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

బీసీ ఎమ్మెల్యే లెజిస్లేచర్ కమిటీ ఏర్పాటు చేయాలి: వక్తలు

పంజాగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ఓబీసీ స్టాండింగ్ కమిటీ మాదిరిగా తెలంగాణ అసెంబ్లీలో బీసీ లెజిస్లేచర్ కమిటీని ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేశ్ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సబ్బండవర్గాల ఆత్మగౌరవ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మాజీ ఎంపీలు రాపోలు ఆనంద భాస్కర్, అజీజ్ పాషా, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు విశారదన్ మహారాజ్, తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో దశాబ్దాలుగా వివక్షకు, నిరాదరణకు లోనవుతున్న బీసీ, అణగారిన వర్గాలు తమ అవకాశాలకోసం నేటికీ పోరాడాల్సిన పరిస్థితులే నెలకొన్నాయని వారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బీసీ, దళిత, గిరిజన మైనార్టీలకు సముచిత ప్రాతినిధ్యం లేదన్నారు. బీసీలకు ప్రత్యేకమైన పారిశ్రామిక పాలసీని, ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. బీసీ, ఎస్టీ వర్గాలకు డిప్యూటీ సీఎంగా అవకాశాలను కల్పించాలని కోరారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో 10 స్థానాలను బీసీలకు కేటాయించాని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, గుజ్జ కృష్ణ, దొంత ఆనందం, ఆళ్ల రామకృష్ణ, యుగేందర్ యాదవ్, శివ, కిశోర్, దానకర్ణ చారి, ఊర్మిళ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



చైన్‌స్నాచర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

చైన్‌స్నాచర్ అరెస్ట్

బౌద్ధనగర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తెంపుకుని పరారైన స్నాచర్‌ను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ గిరిధర్, చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, డీఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం పద్మారావునగర్ స్కందగిరి ఆలయ ప్రాంతంలోని ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న తుల్జాబాయి(80) గతనెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట పదిహేను నిమిషాల సమయంలో టీవీ చూస్తుంది. తలకు హెల్మెట్ ధరించిన దుండగుడు ప్రహరీగోడ దూకి ఇంట్లోకి ప్రవేశించి తుల్జాబాయి మెడలోని బంగారు గొలుసుకుని తెంపుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా బయ్యారం జగ్గుతండాకు చెందిన బూక్యా కిరణ్‌కుమార్ ఆలియాస్ చిట్టి(28) కొంతకాలం క్రితం నగరానికి వలసవచ్చి నాగారం దమ్మాయిగూడలో నివసిస్తూ ర్యాపిడో, ఓలా సంస్థలో టూవీలర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడిన కిరణ్‌కుమార్ సులభంగా డబ్బులు సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ర్యాపిడోకు వినియోగించే ద్విచక్ర వాహనంపై తిరుగుతూ రెక్కీ నిర్వహించేవాడు.పద్మారావునగర్‌లో వృద్ధురాలు ఒంటరిగా నివశిస్తున్నట్లు గుర్తించి అదను చూసి స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. వందకు పైగా సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితుడు వినియోగించిన ద్విచక్రవాహనం నెంబర్‌ను గుర్తించారు. చిలకలగూడ చౌరస్తాలో శనివారం వాహనాలను తనిఖీలు చేస్తుండగా అటుగా వెళ్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించగా చేసిన నేరం ఒప్పుకున్నాడు. 9.1గ్రాముల బంగారు గొలుసు, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ కీస్ హైస్కూలు సమీపంలోని పిల్లర్ నెంబరు 1182 శుక్రవారం వద్ద గుర్తుతెలియని 60 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న కానిస్టేబుల్ మహేష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని గోపాలపురం ఇన్‌స్పెక్టర్, ఎస్సైలకు సమాచారం ఇచ్చిన అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు గోపాలపురం పోలీసులు భావిస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...



అడ్డగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ వద్ద చనిపోయి ఉన్న వృద్ధుడిని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేటు నెంబరు 3 వద్ద అనారోగ్యంతో గుర్తుతెలియని (60) ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా, సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తేవెంటనే 8712660210 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెకండ్‌బజార్‌లోని భవనంలో అగ్నిప్రమాదం

రెజిమెంటల్‌బజార్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ సెకండ్ బజార్‌లో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. శనివారం మధ్యాహ్నం సెకండ్ బజార్‌లో శ్యామ్‌సుందర్‌కు చెందిన జి ప్లస్ నాలుగు అంతస్థుల భవనంలో షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు భవనంలో కిరాయికి ఉంటున్న వారిని అప్రమత్తం చేయడంతో బయటకు పరుగులుతీశారు. భవనంలో 60మంది నివాసం ఉంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సామగ్రి అంటుకుని ఉంటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.



అగ్నిప్రమాదం జరిగిన భవనం

డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చేందుకు.. విద్యాశాఖతో కలిసి పోలీసుల ప్రణాళిక

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఫ్రీ సిటీలో భాగంగా డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు విద్యాశాఖతో కలిసి పోలీసు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించనున్నారు. దీనికి సంబంధించి ఆదివారం కమాండ్ కంట్రోల్ రూంలో విద్యాశాఖ సెక్రటరీ బి.వెంకటేశం, కమిషనర్లు కొత్తకోట శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి, టీఎస్‌న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, యాంటీ నార్కొటిక్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ కేజీఎస్‌ఎస్ శ్రీకాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించనున్నారు.

బకాయిలు చెల్లిస్తేనే ఔషధాల సప్లై

పంజాగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఈఎస్ఐసీలకు సైతం అత్యవసర ఔషధాలు, చికిత్సలకు వినియోగించే వైద్యపరికరాలను సరఫరా చేయలేమని ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా టెండర్లు పొంది గాంధీ, ఉస్మానియా, నిమ్స్, నిలోఫర్‌లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, ఈఎస్ఐసీలకు ఔషధాలు, రోగులకు అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేస్తున్నామని, గతేడాది ఆగస్టు నుంచి తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వక్తలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్

సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనంలేదని వాపోయారు. రోగులకు ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని, ఆర్థిక వనరుల లేమితో సరఫరా చేయలేని దుస్థితి నెలకొందన్నారు. సమస్య జఠిలం కాక ముందే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

టీఎస్ఎంఐడీసీ నుంచి రూ.300 కోట్లు, ఈఎస్ఐసీ నుంచి రూ.100 కోట్లు, నిమ్స్ నుంచి సుమారు రూ.50కోట్లు, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల జనరల్ బడ్జెట్ నుంచి బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.